# సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాల ఫలితం బ్రిగ్జిట్

**2016** జూన్ 23న సాగిన ప్రజాభిప్రాయ సేకరణలో బ్రిటన్ పౌరులు యూరోపియన్ యూనియన్ (ఇయు) నుండి బయటకు రావాలని ఓటు చేశారు. మొత్తం 72 శాతం ప్రజలు ఓట్లు వేయగా, బయటకు రావాలని 51.9 శాతం మంది, ఇయులోనే కొనసాగాలని 48.1 శాతం మంది ఓటు చేశారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ ఫలితం బ్రిటన్‌లోనేకాక, యూరప్‌లోనూ ప్రపంచంలోనూ ప్రకంపనాలను కలిగించింది. తక్షణమే జరిగే మార్పులంటూ ఇప్పుడే ఏమీ లేకపోయినా, ఇయు నుండి బ్రిటన్ బయటకు వచ్చే క్రమం ఎన్నాళ్ళు సాగుతుందో ఎవరూ చెప్పలేని స్థితే వుంది.

ప్రపంచంలోనే ఐదవ పెద్ద ఆర్థికాన్నీ, ఇయులో రెండవ పెద్ద ఆర్థికాన్నీ కలిగి వున్న బ్రిటన్, ఇయు నుండి బయటకు రావటమన్న నిర్ణయం ఆర్థికంగానూ (వాణిజ్యం, ఉద్యోగాలు, పెట్టుబడి మదుపు, స్టాక్ మార్కెట్లు మొ॥) రాజకీయంగానూ (జాతీయోన్మాదం, జాతి వివక్షత, నిర్బంధం, హక్కుల హరింపు) లోతైన ప్రభావాన్ని కలుగజేస్తుంది.

ప్రస్తుతం బ్రిటన్ చీలిపోయి వుంది. ఇయు నుండి బయటకు రావాలని ఇంగ్లాండు, వేల్స్ ప్రాంతాలు ఓటు చేయగా, స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్‌లు ఇయులో కొనసాగాలని ఓటు చేశాయి. దీనిపై మళ్ళీ రిఫరెండం జరపాలనీ (మెజారిటీ తక్కువగా వున్నందున), స్కాట్లాండుకు స్వాతంత్ర్యమిచ్చేందుకు రిఫరెండం జరపాలనీ వాదనలు ఇప్పటికే తెరమీదకు వచ్చాయి.

ప్రజాభిప్రాయసేకరణకు ముందు, బ్రిటన్‌లోని రాజకీయ నాయకత్వమూ, రాజకీయ విశ్లేషకులూ, అలాగే జర్మనీ, ఫ్రాన్సు, అమెరికాలోని విశ్లేషకులూ ఇయులో కలిసి వుండాలనే ఫలితం వుంటుందని ఊహించారు. వారి అంచనాలన్నీ తప్పయ్యాయి. ఈ ప్రజాభిప్రాయసేకరణలో కార్మికవర్గ ప్రాంతాలలో ఎక్కువ పోలింగు జరగటమన్న దానిలో ప్రజానిరసన అన్న అంశం వుంది. టోరీ పార్టీ పాలన పట్లా, ఇయు విధానాలపట్లా కార్మికుల్లో పేరుకునివున్న ఆగ్రహం వారిని ఇయు నుండి బయటకు రావాలని ఓటు చేయించింది. ఏడాదికి 15వేల పౌండ్లకంటే తక్కువ ఆదాయవర్గాలెక్కువగా ఇయునుండి బయటకు రావాలని ఓటు చేశారని బిబిసి వ్యాఖ్యానించింది. అయితే కార్మిక జనాల్లోని ఈ ఆగ్రహాన్ని తీవ్ర మితవాదశక్తులు – జాతీయోన్మాదాన్నీ, వలస ప్రజలపై వ్యతిరేకతనూ ప్రచారంచేసి బ్రిగ్జిట్‌కు అనుకూలంగా మలచగలిగాయి.

బ్రిగ్జిట్‌వాదులు (ఇయునుండి బయటకు రావాలని వాదించినవారు)–వీరితో ఎక్కువ గొంతుతో ప్రచారం చేసింది యునైటెడ్ కింగ్‌డం ఇండిపెండెంట్ పార్టీ (యుకెఐపి) – వలసవచ్చినవారివల్ల కార్మికులు, మధ్యతరగతి ప్రజలు ఉద్యోగాలు కోల్పోతున్నారని ప్రధానంగా ప్రచారం చేశారు. జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టారు. వీరివల్ల బ్రిటన్‌పౌరులు కోల్పోతున్న ఉద్యోగాలు అతితక్కువనీ, దీనికి సంబంధించి ఆధారపడదగ్గ గణాంక వాస్తవాలు లేకుండానే ప్రచారం సాగుతున్నదనీ "ది ఇకనామిస్ట్" వ్యాఖ్యానించింది. దక్షిణ యూరపు, ఉత్తర యూరపునుండి ఉద్యోగాల కొరకు పశ్చిమ యూరపుకు వలస వస్తున్నారు. వీరిని రెండవ శ్రేణి పౌరులుగా చూస్తున్నారు. అదే సమయంలో ఆసియా, ఉత్తర ఆఫ్రికా దేశాలనుండి వలసవచ్చిన ప్రజలను వివక్షకూ, ఘోర జాతి వివక్షతకూ గురిచేస్తున్నారు. వలస ప్రజల శ్రమశక్తిని కారుచౌకగా దోచుకునేందుకు బూర్జువావర్గం అమలుచేస్తున్న పద్ధతి యిది.

కాగా పెట్టుబడిదారీ సంక్షోభభారాన్ని ప్రజలపై మోపేందుకు ఇయు అనుసరిస్తున్న తీవ్ర పొదుపు చర్యలే బ్రిటన్‌లోనూ, యూరపులోనూ నిరంతరాయంగా పెరుగుతున్న నిరుద్యోగానికి కారణం. గ్రీసు అనుభవం దీనినే తేగేసి చెప్పింది. ఈ వాస్తవాన్నుండి కార్మికుల దృష్టిమరల్చేందుకు, వలస కార్మికులే నిరుద్యోగానికి కారణమన్న తీరులో ప్రచారం కావించారు. ఇయు పెత్తనం సాగరాదంటూ, మన సరిహద్దులు మనమే కాపాడుకుందామంటూ సంకుచిత జాతీయవాదాన్ని ముందుకు తెచ్చారు. ఆ విధంగా ప్రజల ఆగ్రహాన్ని బ్రిగ్జిట్‌కు అనుకూలంగా మలిచారు.

కాగా ఇయులో కొనసాగాలని వాదించిన వారు కూడా నిరుద్యోగ సమస్యనే ముందుకు తెచ్చారు. ఇయు నుండి బయటకు వస్తే 30 లక్షల ఉద్యోగాలు కోల్పోవాల్సివస్తుందనీ
, దానివల్ల సామాజిక సంక్షేమానికి భారీ కోత పెట్టాల్సివస్తుందనీ వాదించారు. ఇయులో కొనసాగటమంటే తూర్పుఆసియాలో కార్మిక పని పరిస్థితుల స్థాయికి యూరపు కార్మికుల పనిపరిస్థితులను దిగజార్చే తీవ్ర కార్మిక వ్యతిరేక చర్యలను అమలుజరపటమేనన్న వాస్తవాన్ని వారు దాచిపెట్టారు. ఈ కార్మిక వ్యతిరేక చర్యలను ఇప్పటికే జర్మనీ, ఫ్రాన్సు, బెల్జియంలలో అమలుజరిపారు. ఫ్రాన్సులో కార్మికులు, యువత దీనికి నిరసన తెలుపుతూ రోడ్లమీద కొచ్చారు. అలాగే ఇయు వల్ల కలిగిన కొద్దిపాటి లబ్ధినీ–సరిహద్దులవద్ద చెకింగ్ తొలగింపు, కొన్ని ప్రజాస్వామిక హక్కులకు హామీ, కోరుకున్న దేశంలో పనిచేసే, చదువుకునే అవకాశాలను –మధ్యప్రాచ్యంలో సామ్రాజ్యవాద దురాక్రమణ విధాన ఫలమైన టెర్రరిజం భూతాన్నీ, శరణార్థుల సమస్యనూ సాకుగా చూపి తొలగించి వేస్తున్నారన్న వాస్తవాన్ని కూడా వీరు దాచిపెట్టారు. ఈ ప్రచార ఫలితంగా 24 ఏళ్లలోపు ఓటర్లలో 75శాతం ఇయులో కొనసాగాలని ఓటు చేశారు.

మొత్తంగా సాగిన ప్రచారంపై "ది ఇకనామిస్ట్" ఇలా వ్యాఖ్యానించింది: "ఇరుపక్షాలు చేసిన ప్రచారంతో ఓటర్లు గందరగోళానికి గురయ్యారు. ఇయులో బ్రిటన్ సభ్యత్వానికి చెందిన సిసలు వాస్తవాలు చెప్పమని మీడియాను కోరుతున్నారు. దానివల్ల వారొక అభిప్రాయానికి రావచ్చు. విచారకరమేమంటే అసలు వాస్తవాలు లభ్యంకావటం కష్టంగా వుంది". (5-3-16)

ప్రధాని డేవిడ్ కెమరాన్, లేబర్ పార్టీ నాయకుడు కార్బిన్‌ల నాయకత్వంలో ఇయులో కొనసాగాలన్న శిబిరమూ, టోరీపార్టీ నాయకుడు బోరిస్‌జాన్సన్, యుకెఐపి నాయకుడు నిగెల్‌ఫరాజ్‌ల నాయకత్వంలో ఇయునుండి విడిపోవాలనే శిబిరమూ రెండూ కూడా ఉద్యోగాలనూ, సంక్షేమ చర్యలనూ కాపాడటమన్న నినాదంతోటి తమ అసలు లక్ష్యాలను కప్పిపుచ్చుకున్నాయి. ఇయు సభ్యదేశంగా బ్రిటన్ ఏడాదికి 2800కోట్ల పౌండ్లు చెల్లిస్తుంది. బయటకు వస్తే ఆ సొమ్ము మిగులుతుంది గనుక దానినుండి 35 కోట్ల పౌండ్లు జాతీయ ఆరోగ్య సేవలకు ఖర్చుపెడతామని విడిపోవాలన్న శిబిరం వాగ్దానం చేసింది. ప్రజాభిప్రాయ సేకరణలో "విజయం" వచ్చినరోజు ఉదయాన్నే యుకేఐపి నాయకుడు నిగెల్ ఫరాజ్ ఈ వాగ్దానం చేసి విడిపోవాలన్న శిబిరం "తప్పు" చేసిందన్నాడు, బ్రిగ్జిట్ అనుకూల తీర్పురాగానే సంక్షేమ వాగ్దానం తప్పుగా మారటం, రాబోయే రోజుల్లో కార్మికవర్గంపై జరగబోయే దాడిని సూచిస్తున్నది.

టోరీ పార్టీలో వున్న తన ప్రత్యర్ధులను తృప్తి పరిచేందుకూ, యుకేఐపి ప్రాబల్యం పెరగకుండా నివారించేందుకూ బ్రిటిషు ప్రధాని కేమరాన్ ప్రజాభిప్రాయ సేకరణకు పిలుపునిచ్చాడు. ఇయులో కొనసాగాలనే ఓటర్లు తీర్పుయిస్తారని ఆయన అంచనా వేశాడు. ఆయన అంచనాలు తప్పాయి. బ్రిగ్జిట్‌కు అనుకూలంగా ఓట్లు పడ్డాయి. ఇది టోరీ పార్టీలో చీలికను పెంచింది. అంతకుమించి బ్రిటన్ ప్రజల మధ్య చీలికను పెంచింది. ఇయులో సంక్షోభాన్నీ తెచ్చింది.

**బూర్జువా ప్రయోజనాలు**

ఇంకా లోతుల్లోకి వెళ్లి పరిశీలించితే అసలు యుద్ధం, బ్రిటిషు బూర్జువావర్గంలో సాగింది. బ్రిటీషు బూర్జువావర్గ ప్రయోజనాలు ఏకీకృత యూరపు మార్కెట్లో కొనసాగినందువల్ల బాగా నెరవేరతాయా? లేక "యూరపును దాటి ప్రపంచంలోకి దూకటం"వల్ల బాగా నెరవేరుతాయా? అన్నదే బ్రిటీషు బూర్జువా వర్గానికెదురైన సమస్య. దీని పరిష్కారంకోసం అవి రిఫరెండం దాకా వచ్చాయి.

ఇది బ్రిటన్‌కు మాత్రమే ఎదురైన సమస్యకాదు. యూరపు అంతటా మితవాద, నయాఫాసిస్టు పార్టీలు – ఫ్రాన్సులో నేషనల్ ఫ్రంటు నాయకుడు లీపెన్, నెదర్లాండులో ఫ్రీడం పార్టీ నాయకుడు గీర్ట్ వైల్డర్స్ మొదలైనవారు–జాతీయోన్మాదాన్నీ, జాతివివక్షనూ, వలసవచ్చిన వారిపై వ్యతిరేకతనూ రెచ్చగొడుతున్నారు. ఇయుకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. కాగా అట్లాంటిక్ మహాసముద్ర ఆవలితీరాన, అమెరికా అధ్యక్ష పదవికి పోటీపడుతున్న ఇద్దరు అభ్యర్ధులూ – డోనాల్డు ట్రంప్, హిల్లరీక్లింటన్ – ఇదే సంకుచిత జాతీయతత్వాన్నీ, వలసవచ్చిన వారిపై వ్యతిరేకతనూ రెచ్చగొట్టి అమెరికా ప్రజల అభిప్రాయాన్ని ఎన్నికల్లో తమ కనువుగా మార్చుకోవాలని చూస్తున్నారు. ఈ అన్ని సామ్రాజ్యవాద దేశాల గుత్తపెట్టుబడిదారుల మధ్య తగవుకు, పరిష్కరించజాలని ఆర్ధిక సంక్షోభంలో వారు కూరుకుపోవటమే మూలకారణం.

ఇది ఒక పార్శ్వం మాత్రమే. అసలీ సమస్య బూర్జువా వర్గానికెందుకు ఎదురయ్యింది? దీని ప్రతిఫలనాలు ఇతర యూరపు దేశాలలో ఎందుకు కన్పిస్తున్నాయి? నార్డిక్ దేశాలయిన ఐస్‌లాండ్, ఫిన్లాండ్, నార్వే, స్వీడన్, డెన్మార్క్‌లు ఇయునెందుకు తీవ్రంగా విమర్శిస్తున్నాయి?

**శాంతిని అడ్డుపెట్టుకుని....**

రెండు ప్రపంచయుద్ధాలూ యూరపులో ఎనలేని విధ్వంసాన్నీ, మానవ మారణహోమాన్నీ తెచ్చాయి. యూరపు సామ్రాజ్యవాద శక్తులు రెండవ ప్రపంచ యుద్ధంలో కూలిపోకుండా సోవియటు యూనియన్ నాయకత్వాన సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫాసిస్టు వ్యతిరేక, శాంతికాముకశక్తులు సాగించిన పోరాటం కాపాడింది. అయితే, చివరికి అవి వలసలను కోల్పోయి, వాటి ఆర్ధికం నాశనమై, తూర్పుయూరపు జనతా ప్రజాస్వామికం, సోషలిజాలవైపు సాగటంతో బలహీనపడ్డాయి.

సంబంధాలలో వచ్చిన మార్పులరీత్యా, తమ ఆర్ధిక వ్యవస్థలను పునరుజ్జీవింపచేయటమెట్లా, తమ ఉమ్మడి శత్రువు సోవియటు యూనియన్‌ను నిలువరిం చటమెట్లా, తూర్పుయూరపును తిరిగి పెట్టుబడిదారీ వ్యవస్థలోకి తీసుకురావటమెట్లా అన్నవి యూరపు సామ్రాజ్య వాదులకు ప్రధాన సమస్యలుగా ఎదురయ్యాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థలో వున్న యూరపు ప్రజలు శాంతినీ, యుద్ధంలేని యూరపును కోరుకుంటున్నారు. దీనిని ఆసరా చేసుకుని, బూర్జువావర్గ నాయకులూ, రాజకీయ నాయకులూ యూరపు దేశాలు ఆర్ధికంగా సమైక్యం కావటమే శాంతి సౌభాగ్యాలకు మార్గం వేస్తుందన్న భావనను ప్రచారం చేశారు. ఆవిధంగా ఐక్యయూరప్, యూరోపియన్ యూనియన్ అన్న దానిని ముందుకు తెచ్చారు.

రెండవ ప్రపంచయుద్ధం ముగిసేనాటికి శక్తివంతమైన సామ్రాజ్యవాద దేశమై, పెట్టుబడిదారీ శిబిరానికి నాయకుడిగా రూపొందిన అమెరికా సామ్రాజ్యవాదం బ్రిట్టన్‌వుడ్స్ ఒప్పందంద్వారా, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, గాట్ సంస్థలను ఏర్పరచింది. వీటిద్వారా యుద్ధానంతర ప్రపంచ ఆర్ధికాన్ని నిర్దేశించపూనుకుంది. యూరపులోని గుత్తపెట్టుబడిదారులు కూడా దీనినే యూరపులో కూడా అమలుచేయాలను కున్నారు. దానిలో భాగంగా 1952లో యూరపు బొగ్గు, ఉక్కు సమాజం ఏర్పడింది. 1957లో జర్మనీ, ఫ్రాన్సు, ఇటలీ, బెల్జియం, నెదర్లాండ్, లగ్జెంబర్గులు కలిసి యూరోపియన్ ఇకనామిక్ కమ్యూనిటీ(ఇఇసి) ఏర్పరచుకున్నాయి. 16 ఏళ్లతర్వాత 1973లో బ్రిటన్ దీనిలో చేరింది. 1992లో మాస్ట్రిచ్ ఒప్పందం తర్వాత ఇయు ఏర్పడినట్లు ప్రకటించారు. 2002లో 12 యూరపు దేశాల కరెన్సీ స్థానంలోకి యూరో వచ్చింది. తర్వాత దీని సభ్యత్వం తూర్పుయూరపుకు విస్తరించింది. ప్రస్తుతం ఇయులో 28 దేశాలు సభ్యత్వం కలిగివున్నాయి.

ఇయు ఏర్పాటులో మూడు అంశాలు ప్రధానంగా పనిచేశాయి. కమ్యూనిజంపట్ల భీతితో సోవియటు యూనియన్‌కు వ్యతిరేకంగా

సాగించిన ప్రచ్ఛన్న యుద్ధం ఒకటి. అమెరికా సామ్రాజ్యవాదం అనుసరించిన విధానాలు, యూరపులో దాని పాత్ర రెండవది. ఇక యుద్ధానంతరం సాధ్యపడిన ఆర్థికవృద్ధి బూర్జువా వర్గానికిచ్చిన వెసులుబాటు. ఈ కారణాలరీత్యా యూరపు బూర్జువా వర్గాలు చేతులు కలిపాయి. 1990లో రష్యా సోషల్ సామ్రాజ్యవాదం కూలిపోవటంతో పరిస్థితి మారింది. అమెరికా ప్రపంచీకరణ వ్యూహాన్ని ముందుకు తెచ్చింది. ఇయు తూర్పుయూరపు దేశాలకు విస్తరించింది. అలాగే ఏకీకృత మార్కెట్టు ఏర్పడింది. వీటితో యూరపు సామ్రాజ్యవాద దేశాల మధ్యన, వాటికి అమెరికా సామ్రాజ్యవాదంతోనూ అనివార్యంగా వైరుధ్యాలు తలెత్తాయి.

ఇయు ఒక సామ్రాజ్యవాద సంస్థ. యూరపు సామ్రాజ్యవాద శక్తులకు లబ్ధిచేకూర్చేందుకే అది ఏర్పడింది. దీని విధానాల నిర్ణయంలో ప్రజలకెలాంటి పాత్రాలేదు. ఇయులోని కార్యనిర్వాహక సమితి(ఇసి) అన్ని నిర్ణయాలను చేస్తుంది. ఆవిధంగా అది సభ్యదేశాల జాతీయ హక్కులను (పన్నుల విధింపు, వాణిజ్య చట్టాలు తదితర అధికారాలు ఇయు పరమయ్యాయి) తొలగించింది. ఇన్నేళ్లుగా ఇయుపై జర్మనీ, ఫ్రాన్సు, బ్రిటన్‌లు పెత్తనం సాగిస్తూ వచ్చాయి. దానివల్ల వచ్చిన లబ్ధిని పూర్తిగా అవే స్వంతం చేసుకున్నాయి. వీటిమధ్య కుమ్మక్కు, పోటీ వుంటూ వచ్చింది.

2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభంతో ఈ వైరుధ్యాలు తీవ్రమయ్యాయి. గ్రీసు రుణసమస్య, మధ్యప్రాచ్యం నుండి వస్తున్న శరణార్థుల సమస్య, మధ్యప్రాచ్యంలోనూ, ఉక్రేయిన్‌లోనూ అమెరికా సామ్రాజ్యవాదం సాగిస్తున్న యుద్ధాలు వీటి మధ్య విభేదాలను తీవ్రం చేసింది. ఇయుపై ఆధిపత్యం సాధించాలన్న తపన జర్మనీది. గ్రీసు, స్పెయిన్, పోర్చుగల్‌లపై తీవ్ర పొదుపు చర్యలను ఇయుతో విధింపచేసింది. 'ద్రవ్యవిధాన సడలింపు'ను అమలుచేయాలన్న (పొదుపు చర్యల అమలును ఆపాలన్న) ఫ్రాన్సు డిమాండును త్రోసిపుచ్చింది. అమెరికా సామ్రాజ్యవాద వైఖరికి భిన్నంగా, ఇయు విదేశాంగ, సైనిక విధానాన్ని రూపొందించేందుకు పూనుకుంది. నాటోకు సమాంతరంగా యూరోపు సైన్యాన్ని సృష్టించేందుకు పూనుకుంది. వీటిని బ్రిటన్ తీవ్రంగా వ్యతిరేకించింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సైనికంగా తొందర పడకుండా జాగ్రత్తగా వ్యవహరించిన జర్మనీ వైఖరిని ఛాన్సెలర్ మెర్కెల్ రెండేళ్ల క్రితం తిరస్కరించింది. "జర్మన్ పౌరుల ప్రయోజనాలకూ, ఆ క్రమంలో జర్మనీ ఆర్థిక ప్రయోజనాలకూ జర్మనీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధను చూపుతుంది" అని ప్రకటించింది. యూరోపు దేశాలలో జాతీయవాదులు దీనిని చూపెట్టి, ఖండంపై తిరుగులేని ఆధిపత్యంకొరకు జర్మనీ ప్రయత్నిస్తున్నదంటూ భయపెడుతున్నారు.

## బ్రిగ్జిట్ తర్వాత

ఇయు నుండి బయటకు రావాలని బ్రిటన్ ప్రజల ఓటు తర్వాత, ఇయులో వున్న వైరుధ్యాలు తీవ్ర మయ్యాయి. తీర్పు వచ్చిన వెంటనే జర్మనీ ఛాన్సలర్ మెర్కెల్ "ఇప్పుడిది వూహించుకోవటానికి కష్టమైనా" ఇయులో పెద్దశక్తుల మధ్యనున్న వైరుధ్యాలు మరొక యుద్ధంగా బ్రద్దలు కాబోవన్న హామీ ఏమీలేదు" అని సూటిగా చెప్పింది. ఇన్నాళ్ళు బ్రిటన్ వ్యతిరేకిస్తూ వచ్చిన తన విధానాలను ముందుకు తీసుకువెళ్లేందుకు బ్రిగ్జిట్‌వల్ల వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలని జర్మనీ తీర్మానించుకున్నట్లు కన్పిస్తున్నది.

జర్మన్ ఛాన్సలర్, ఫ్రెంచి అధ్యక్షుడు హోలాండ్‌తో సమావేశమయ్యారు. దీనికి ఇటలీ ప్రధాని మట్టియో రెంజిని కూడా ఆహ్వానించారు. జర్మనీ, ఫ్రాన్సు విదేశాంగ మంత్రులు రూపొందించిన "ఒక అనిర్దిష్ట ప్రపంచంలో బలీయ యూరపు" అన్న సంయుక్త పత్రాన్ని మూడు ప్రభుత్వాలూ ఆమోదించాయి.

ఈ సంయుక్త పత్రం యూరపును "భద్రతా సమాఖ్య"గా నిర్వచించింది. ఇది "సమిష్టి భద్రతా, రక్షణ విధానం కొరకు పాటుపడుతుంద"ని పేర్కొంది. ఇయును "మెట్టు మెట్టుగా స్వతంత్ర, ప్రపంచశక్తిగా" అభివృద్ధి చేస్తుందని పేర్కొంది. "యూరపు" రాజకీయంగా, సైనికంగా జోక్యం చేసుకునే ప్రాంతాలుగా ఉక్రెయిన్, మధ్యఆసియా, ఆఫ్రికాలను ఈ పత్రం గుర్తించింది. "పౌర, సైనిక చర్యలను మరింత ఫలప్రదంగా పథకం ప్రకారం అమలుజరిపేందుకు" ఇయుకు కేంద్రీకృత సంస్థలను ఏర్పాటుచేసుకోవాలని కూడా పత్రం చెప్పింది. యూరపుపై పెత్తనంకోసం జర్మనీ తన రాజకీయ, సైనిక విధానాలను ముందుకు తెస్తున్నదన్నది స్పష్టం.

ఇది ఇతర యూరపు దేశాలలో వ్యతిరేకత తెచ్చింది. పోలాండు, ఛెక్ రిపబ్లిక్కు, స్లోవేకియా, హంగరీలు ప్రెగ్ నగరంలో సమావేశమయ్యాయి. సంయుక్త పత్రాన్ని పోలాండు తీవ్రంగా వ్యతిరేకించింది. ఇయుకోసం జరిగిన ఒప్పందాలను దేశాలకు అధికార వికేంద్రీకరణ సాగేవిధంగా తిరిగి వ్రాసుకోవాలని డిమాండు చేసింది. విదేశీయులను అనుమతించే ఇయు విధానాన్ని హంగరీ విదేశాంగమంత్రి విమర్శించాడు. "తమ జీవితాలనూ, భవితవ్యాన్ని తామే నిర్ణయించు కోవాలని యూరోపియన్లు కోరుకుంటున్నారు. బ్రస్సెల్స్‌లో, తలుపులు మూసిన గదుల్లో కూర్చుని కొందరు అధికారులు యూరపు భవిష్యత్తుపై చేస్తున్న నిర్ణయాలను ఆమోదించటానికి వారు సిద్ధంగా లేరు" అన్నాడు.

జూన్ 29న బ్రిటన్ పాల్గొనకుండానే ఇయు సమావేశం జరిగింది. ఇయు విదేశీ విధాన ముఖ్యుడు ఫెదరికా మొఘెరిని సమర్పించిన "యూరపు విదేశీ, భద్రతా విధానం కొరకు ప్రపంచ వ్యూహం" అన్న పత్రాన్ని మిగిలిన 27 దేశాలూ అంగీకరించాయి. ప్రపంచంలో ఎక్కడైనా సైనికంగా జోక్యంచేసుకునే ప్రపంచశక్తిగా ఇయు రూపొందాలని ఈ పత్రం వాదించింది. యూరపును శత్రువులనుండి రక్షించటంలో నాటో పాత్రను గుర్తిస్తూనే ఈ పత్రం "ఈ ప్రయత్నాలకు తోడ్పడుతూనే, స్వతంత్రంగా వెనువెంటనే ఎప్పుడు అవసరమైనా చర్యలోకి దిగేందుకు మరింత శిక్షణను పొంది, తగిన సాధనాలతో నిర్మాణయుతంగా వుండాల"ని పత్రం పేర్కొంది.

"వాణిజ్యానికీ, సహజవనరుల అందుబాటుకూ కీలకమయిన సముద్రమార్గాలూ, మహాసముద్రాల రక్షణ"తన ప్రయోజనాలుగా ఈ పత్రం ప్రకటించింది. దానికోసం ఇయు "ప్రపంచ సముద్రమార్గ భద్రతకు తోడవుతుంది; హిందూ, మధ్యధరా మహాసముద్రాలతో తన అనుభవాన్ని తీసుకుని, గల్ఫ్ ఆఫ్ గినియా, దక్షిణచైనా సముద్రం, మలక్కా జలసంధులలోగల అవకాశాలను చూస్తుంది".

"సమీకృత, సహకార కృషితో" సైనిక సమర్థతను పెంచుకోవాలనీ, దీనికోసం "విస్తారమైన సహకారం ద్వారా పెట్టుబడి మదుపూ, సహజవనరుల గరిష్ట వినియోగం" అవసరమౌతాయనీ ఈ పత్రం పేర్కొంది. దీనర్థం సంక్షేమ వ్యయంపై కోత విధించటంద్వారా సైనికీకరణ మొత్తం భారాన్ని కార్మికులపై మోపుతారు.

బ్రిగ్జిట్ ఓటు పర్యవసానాలు ఇప్పుడే మొదలయ్యాయి. అవి యూరపు సామ్రాజ్యవాదశక్తుల మధ్య ఉద్రిక్తత పెరగటంగా వ్యక్తమౌతున్నాయి. యూరపుపై ఆధిపత్యం పొందాలనీ, ఆసియా, ఆఫ్రికా, లాటిన్అమెరికా దేశాలపై దోపిడీలో తన వాటా పెంచుకోవాలనీ జర్మనీ కోరుకుంటున్నది. జర్మనీ, ఫ్రాన్సుల తర్వాతి స్థానంలో ఇయులో వుండేకంటే, బయటపడి తానే ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్లలో తన వాటా పెంచుకోవాలని బ్రిటన్ కోరుకుంటున్నది. ఫ్రాన్సు, జర్మనీతో కుమ్మక్కు పోటీ పడుతూ యూరపులో తన స్థానాన్ని పెంచుకోవాలనీ, దోపిడీలో తగిన వాటా పొందాలని చూస్తున్నది. కాగా అమెరికా సామ్రాజ్యవాదం తన ప్రపంచాధిపత్యానికి పోటీరాకుండా, తన డాలరుకు యూరో పోటీరాకుండా యూరపుపై సైనికాధిపత్యం కొరకు రష్యా బూచితో నాటో కూటమి దెబ్బతినకుండా చూడటానికి అమెరికా సామ్రాజ్యవాదం చూస్తున్నది. వివిధ సామ్రాజ్యవాదుల మధ్య నెలకొన్న దోపిడీ ఆధిపత్యాలకొరకు ఈ పోటీ సామ్రాజ్యవాదుల మధ్య ఉద్రిక్తతలకు దారితీస్తున్నది. ఈ వైరుధ్యాల ఒక ఫలితమే బ్రిగ్జిట్‌గా వ్యక్తమైంది.

యూరపులోని కొన్ని దేశాలు సామ్రాజ్యవాదుల ఈ ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నాయి. తూర్పుయూరపు దేశాలు జర్మనీ, రష్యాలంటే భయపడుతున్నాయి. అమెరికా ఆధిపత్యంలోని నాటో తమను రక్షించగలదని భ్రమపడుతున్నాయి. రష్యాను రెచ్చగొట్టే ప్రయత్నాలతో, ఉక్రెయిన్‌లో అశాంతి సృష్టితో అమెరికా సామ్రాజ్యవాదం యూరపులో శాంతికి ప్రమాదంగా వుందని నార్డిక్ దేశాలు పరిగణిస్తున్నాయి.

ప్రపంచం మీద ప్రభావం చూపగల యూరపు పరిణామాల భవిష్యత్‌క్రమం సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు ఏ క్రమంలో సాగుతాయన్న దానిపై ఆధారపడి వుంటుందన్నది స్పష్టమే. ఈ సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాల క్రమపరిణామాన్ని మార్చగలిగిన శక్తి – ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో సామ్రాజ్యవాద వ్యతిరేక, జాతీయోద్యమం, విప్లవోద్యమాలదేనన్నది కూడా సుస్పష్టమే.

# వంచనకు మరోపేరు పెట్టుబడిదారీ విధానం

*నిన్నటి వరకూ ప్రపంచీకరణ ఉత్కృష్టతను గురించి మాట్లాడారు. దేశాల సరిహద్దులను చెరిపి వేయాలని ఉపన్యసించారు; పెట్టుబడి, సరుకులు, సేవలు, శ్రమశక్తి స్వేచ్ఛగా ప్రపంచమంతటా కదలటం గొప్పదనాన్ని వర్ణించారు. దీనికోసం ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచవాణిజ్య సంస్థ, యూరోపియన్ యూనియన్‌లను స్థాపించారు. భవిష్య నాగరికతకు ప్రతీకగా ప్రపంచ కుగ్రామాన్ని చిత్రించారు.*

*ఈనాడు జాతీయవాదాన్ని ప్రబోధిస్తున్నారు; మన సరిహద్దులకు భద్రత ఏర్పరచుకోవాలని వాదిస్తున్నారు. విదేశీ వాణిజ్యంపై ఆంక్షలను రక్షణ చర్యలతో విధిస్తున్నారు. భాగస్వామ్య దేశాలమధ్య వాణిజ్యం సాగే ప్రాంతీయ వాణిజ్య కూటములను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలోని షరతులు డబ్ల్యుటిఓనే చిన్నబుచ్చేవిగా వున్నాయి. శ్రామిక వలసలను నిరోధించే చర్యలతోపాటు వారిపై గుడ్డి ద్వేషాన్ని, జాతి వివక్షతను పెంచుతున్నారు.*

*ఎవరు వారు? సామ్రాజ్యవాద దేశాల గుత్తపెట్టుబడిదారీ వర్గం.*

*ప్రపంచ వాణిజ్యసంస్థ **2016 జూన్ 21**న ఒక నివేదికను విడుదలచేసింది. తాను రికార్డులు నిర్వహిస్తున్నప్పటినుండీ పరిశీలించితే **2015** అక్టోబరు నుండి **2016** మే వరకూ జి–20 కి చెందిన పారిశ్రామిక దేశాలు నూతన రక్షిత చర్యలను అత్యధికంగా తీసుకున్నాయని తెలిపింది. ప్రస్తుతం అమలులోవున్న ఈ వాణిజ్యంపై ఆంక్షల సంఖ్య పై దేశాలలో **2010**లో **324** నుండి నేడు **1196**కు చేరాయని తెలిపింది. ఈ వాణిజ్య వ్యతిరేక చర్యలలో అత్యధిక భాగం "కుమ్మరింపు వ్యతిరేక" కేసులుగా వున్నాయి. అంటే సామ్రాజ్యవాద దేశాలు, ఇతర దేశాలు మార్కెట్టు రేటుకంటే తక్కువ ధరకు ఇక్కడ అమ్ముతున్నాయని నిందిస్తుంది. ఆవిధంగా దిగుమతులను నిరోధిస్తుంది.*

*దేశాల సరిహద్దులు ఆటంకాలు లేకుండా అన్నీ స్వేచ్ఛగా ప్రపంచమంతటా వెళ్ళవచ్చున్న తమ "కుగ్రామ ప్రపంచ" అవగాహనకు భిన్నంగా తామే ప్రాంతీయ వాణిజ్య కూటములను (టి.టి.ఐ.పి. టిపిపి వంటి బహుళపక్ష, నాఫ్టాతదితర ద్విపక్ష ఒప్పందాలతో) ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలను మించిన షరతులను ఈ ఒప్పందాలలో మూడవ ప్రపంచదేశాలపై రుద్దుతున్నారు. శ్రామికులు వలసలు రాకుండా చేస్తామంటూ, వచ్చిన వారిని అత్యంత దోపిడీకి గురిచేసేందుకు వారిపై వ్యతిరేకతను ప్రచారం చేస్తున్నారు.*

*తమ ఈ వంచననుండి ప్రపంచ ప్రజల, కార్మికవర్గ దృష్టిని మళ్లించేందుకు ఈ దుష్టవర్గాలు సంకుచిత జాతీయవాదాన్నీ, జాతి వివక్షతనూ ఆశ్రయించాయి.*

*వారి ఈ వెనుకడుగుకు అసలు కారణం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ కోలుకోలేని, పరిష్కరించజాలని ఆర్థికసంక్షోభంలో కూరుకుపోవటమే. దీనితో దోపిడీ వాటాల పెంపుదల కొరకు వారి మధ్య సాగుతున్న కుమ్ములాట బ్రిగ్జిట్‌కు ముందూ, తర్వాత కూడా బయటపడుతున్నది.*

*****